నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | HYDERABAD



చార్మినార్ జోన్‌లోని అలియాబాద్, శంషీర్‌గంజ్, ఇంజన్ బౌలి, శాలి బండ మెయిన్ రోడ్, ఫలక్‌నుమా బ్రిడ్జి ప్రాంతాల్లో గురువారం బల్దియా కమిషనర్ ఆమ్రపాలి పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సేకరించిన చెత్తను వెంటనే డంప్ యార్డ్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. గణేశ్ శోభాయాత్ర సందర్భంగా వెలిసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు.

-సిటీబ్యూరో




డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డితో పాటు రైతు నాయకులు, అన్నదాతలను అరెస్టు చేసిన పోలీసులు

# అవినీతికి ప్లాన్

## సీజ్ చేసిన భవనాల్లో స్పీడ్ అందుకున్న పనులు

గ్రేటర్‌లో అడ్డగోలుగా అక్రమ కట్టడాలు

సీజ్ చేస్తున్నా.. కొనసాగుతున్న నిర్మాణాలు

చెయ్యి తడిపితే చాలు.. అక్రమం.. సక్రమమే



**జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో దందా**

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తే.. నోటీసులు ఇచ్చి నేలమట్టం చేస్తాం..ఇది బల్దియా యంత్రాంగం చెప్పే మాట.. కానీ ఆ మాటలు..చేతల వరకు రావడం లేదు. 'మూటలు' అందితే చాలు.. అక్రమమైనా..సక్రమమైపోతున్నాయి.. గ్రేటర్‌లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే..నోటీసులు ఇవ్వడం.. సీజ్ చేయడం చేస్తున్నా.. చర్యల విషయాన్ని వచ్చే సరికి టౌన్‌ప్లానింగ్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇక్కడ సీన్ కట్ చేస్తే.. సదరు సీజ్ అయిన భవనంలో యజమాని మిగిలిన పనులన్నీ చకచకా కానిచేస్తున్నాడు. ఈ వ్యవహారంలో 'చేతివాటం' గట్టిగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

-సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ )

### కండ్లు మూసుకున్న అధికారులు..





**ఇవిగో ఉదాహరణలు..**

కేపీహెచ్‌బీ కాలనీ 5 రోడ్డులో ప్లాట్ నంబర్ 718లో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నారని బల్దియా సీజ్ చేసింది. ఆ నిర్మాణదారుడు ఏమాత్రం భయం లేకుండా...మరునాడే సీజ్‌ను తొలగించి..చకచకా పనులు మొదలుపెట్టి.. పనులన్నీ పూర్తి చేసేశాడు'.





కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 81లో అనుమతులకు విరుద్ధంగా భవనం నిర్మించారని బల్దియా అధికారులు గుర్తించి.. ఆ భవనాన్ని సీజ్ చేశారు. కానీ...సీజ్‌ను అలాగే ఉంచి.. వారం రోజలకే సదరు నిర్మాణదారుడు భవనం లోపల పనులను ప్రారంభించి...పూర్తి సైతం చేశాడు. మరికొద్ది రోజల్లో జీహెచ్ఎంసీ సీజ్‌ను తొలగించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తునా.. 'చేతివాటం' పనిచేసినట్లు ప్రచారం సాగుతున్నది.

### ఎన్‌ఫోర్స్ ఎక్కడ?

అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. నోటీసు అందుకునే నిర్మాణదారుడు డబ్బులిస్తే చాలు ..ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. అదేమని అడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని.. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు సమాధానమిస్తున్నారు. ఒక నిర్మాణం రాత్రి రాత్రే జరగదు. రోజుల తరబడి ఉంటుంది. ముడుపుల మత్తులో పడి నిబంధనలకు టౌన్ ప్లానింగ్ అధికారులు పాతర వేస్తున్నారు. ఇదిలా ఉంటే నోటీసులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం మరింత విమర్శలకు తావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. స్థానిక జీ+4 అంతస్తుల నిర్మాణాలు జరిగే చోట అడ్డగోలుగా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. సామాన్యుడు చిన్నగా సెట్ బ్యాక్ ఉల్లంఘన చేస్తే.. చర్యలు తీసుకునే అధికారులు.. బడా నిర్మాణదారుల జోలికి మాత్రం వెళ్లడం లేదు. అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు భరోసా దక్కడం లేదు.

### ఐఏఎస్ ఆఫీసర్ ఉన్నా.. కనిపించని మార్పు

కూకట్‌పల్లి జోన్ పరిధిలో నిబంధనలను అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులంతా విఫలమవుతున్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టారు. వెంటనే వివిధ ప్రాంతాల్లో పర్యటించి.. అక్రమ నిర్మాణాలను గుర్తించారు. కొన్నింటిని కూల్చివేయగా, మరికొన్నింటిని సీజ్ చేశారు. వరుసగా రెండు రోజుల్లో ఏడు బిల్డింగ్‌లను సీజ్ చేశారు. ఆగస్టు 13న మూడు బిల్డింగ్‌లను సీజ్ చేయగా, వాటిలో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో, గాజుల రామారం సర్కిల్‌లోని కైసర్‌నగర్‌లో, అల్వాల్ సర్కిల్ పరిధిలోని చిన్నరాయుడి చెరువు దగ్గర రామ్‌నగర్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలున్నాయి. ఆగస్టు 14న నాలుగు బిల్డింగ్‌లను సీజ్ చేశారు. అందులో మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో, కేపీహెచ్‌బీ కాలనీ 5 రోడ్డులో, కూకట్‌పల్లి సర్కిల్‌లోని వెంకట్‌రావునగర్‌లో, అల్వాల్ సర్కిల్‌లోని రాంనగర్‌లో అక్రమ నిర్మాణాలున్నాయి. జీహెచ్ఎంసీ వేసిన సీజ్‌ను తొలగిస్తే.. క్రిమినల్ కేసులు ఉంటాయని హెచ్చరికలు కూడా చేశారు. ఈ చర్యలతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకుపుట్టింది. కానీ..వారం రోజులు గడిచేసరికి యజమానులు సీజ్ చేసిన భవనాల్లో పనులు ప్రారంభించారు. కొందరు సీజ్‌ను అలాగే ఉంచి.. ఆ బిల్డింగ్‌లో మిగిలిన నిర్మాణ పనులను పూర్తిచేయగా.. మరికొందరు.. ఏకంగా సీజ్‌ను తొలగించి... నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. మొత్తానికి జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి పెచ్చుమీరుతున్న ఆరోపణలు వినిస్తున్నాయి.

### నోటీసులతో సరి..

జీహెచ్ఎంసీ సీజ్ చేసిన భవనాల్లో యథేచ్ఛగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఫిర్యాదు వస్తే అధికారులు రంగంలోకి దిగి.. అలా నోటీసులు ఇచ్చినట్టే ఇచ్చి.. దొడ్డిదారిలో పనులకు అనుమతులు ఇచ్చేస్తుండటం గమనార్హం. స్వయంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు వచ్చినా.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. నివాసయోగ్య పత్రాల మంజూరు, నిర్మాణ అనుమతుల జారీ, అక్రమ నిర్మాణాలు లంచావతారులకు ప్రధాన ఆర్థిక వనరుగా మారుతున్నాయి. అనుమతి కోసం వచ్చే దరఖాస్తులను వేర్వేరు కారణాలతో తొక్కి పెట్టడం, భయాందోళనకు గురయ్యే యజమానుల నుంచి ముడుపులు తీసుకోవడం అధికార యంత్రాంగానికి అలవాటుగా మారింది.

# చలో ప్రజాభవన్‌పై ఉక్కుపాదం

## రైతులు, రైతు నేతల ముందస్తు అరెస్టులు

మేడ్చల్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే మేడ్చల్ జిల్లావ్యాప్తంగా వివిధ సహకార సంఘాల చైర్మన్లు, రైతు సంఘాల నాయకులు, రైతులను ముందస్తుగా అరెస్టు చేసి.. 'చలో ప్రజాభవన్'ను అడ్డుకున్నారు. శామీర్‌పేటలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బహుసింగ్, నర్సింహులు, సతీశ్ రెడ్డి, నారాయణరెడ్డి, భూంరెడ్డి సహకార సంఘాల చైర్మన్లు, రైతు సంఘాల నాయకులను అరెస్టు చేసి.. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ తరలించారు. పూడూర్ సహకార సంఘం చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మేడ్చల్ సహకార సంఘం చైర్మన్ రణదీప్‌రెడ్డిలతో పాటు రైతులను మేడ్చల్, పేట్‌బషీరాబాద్ పీఎస్‌లకు తరలించారు. మూడు చింతపల్లి మండలంలోని రైతులను ప్రజాభవన్‌కు వెళ్లకుండా అదుపులోకి తీసుకున్నారు. రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పెద్ద మోసం చేసిందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ కాని రైతులు ప్రజాభవన్ వెళ్తుంటే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. కాగా, పిరం చెరువు గ్రామంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, ఉప్పర్‌పల్లిలో రాజేంద్ర నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అలాగే నర్కూడ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్‌ను, పెద్ద తూప్ర గ్రామంలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ దంపతులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.




# లేబుళ్లు.. వివరాలు లేవు

## 'ఆలివ్'లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. రుచికి, శుభ్రతకు పెట్టింది పేరు అంటూ ఊదరగొట్టే పెద్ద పెద్ద పేరు మోసిన హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో బండారాలు బయటపడుతున్నాయి. గురువారం ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రముఖ ఆలివ్ మిఠాయి షాపులో నామ్‌కీన్, మిక్చర్, చకోడి తదితర ప్యాకెట్లపై లేబుళ్లు సరిగా లేవని, లైసెన్స్ నంబరు, లోగో, తయారీదారుల వివరాలు లేవని గుర్తించారు. జీబీ పాన్ ప్లేస్‌లో డస్ట్ బిన్లకు సరైన మూతలు లేవని , ఫుడ్ హ్యాండర్లకు హెయిర్‌క్యాప్, గ్లౌవ్స్ లేవని గుర్తించారు. రత్నదీప్ రిటైల్ మార్కెట్‌లో చీజ్‌లు , బ్లూ బెర్రీస్ ప్యాకెట్లు ఇతర వాటికి లేబుల్స్ సరిగా లేనట్లు గుర్తించి.. నోటీసులు జారీ చేశారు.

## మండుతున్న ఎండలు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు మండుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతుండటంతో నగర వాతావరణం వేసవిని తలపిస్తున్నది. ఉదయం నుంచే భానుడు ప్రతాపాన్ని చూపుతుండటంతో మళ్లీ ఉక్కపోత సమస్య తప్పడం లేదు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.6, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 51శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# వ్యర్థాల తరలింపు బాధ్యత హైడ్రా దే

## పనులకు టెండర్లు ఆహ్వానించిన కమిషనర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో చెరువులు, నాలాలు, పార్కులు, ఇతర ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడమే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా తాజాగా మరో నిర్ణయం తీసుకున్నది. జూలై 19న ఏర్పాటైన హైడ్రా.. ఇప్పటి వరకు 23 ప్రాంతాల్లో 262 నిర్మాణాలను కూల్చివేసి.. 111.72 ఎకరాలను స్వాధీనం చేసుకున్నది. అయితే నిర్మాణాల తాలూకు వ్యర్థాలను ఎక్కడికక్కడే వదిలి వేసింది. 111 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించిన హైడ్రా.. డెబ్రీస్‌ను ఎత్తివేయకుండానే చెరువుల పరిరక్షించామని చెబుతుండటం ఎంత వరకు సమంజసమని పర్యావరణవేత్తలు ప్రశ్నించారు. దీంతో మేల్కొన్న హైడ్రా వ్యర్థాల తరలింపు బాధ్యతలు తీసుకున్నది. ఈ మేరకు గురువారం టెండర్లను ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న ఏజెన్సీలు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా టెండర్ బిడ్డర్‌లో పాల్గొనాలని కమిషనర్ రంగనాథ్ సూచించారు. కూల్చివేతల్లో వినియోగించాల్సిన మిషనరీ, గడిచిన మూడేండ్లలో రూ.2కోట్ల టర్నోవర్ ఇతర అర్హతలతో టెండర్‌ను ఆహ్వానించారు.

# డ్రగ్స్ అమ్ముతూ..

## పట్టుపడిన ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు

### మరో ముగ్గురు నిందితులు సైతం అరెస్ట్

### ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ స్వాధీనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు దారి తప్పారు.. వ్యసనాలకు అలవాటుపడి.. డ్రగ్స్ అమ్మడం మొదలుపెట్టారు.. ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు. ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు మరో ముగ్గురు అరెస్టయ్యారు. నిందితుల వద్ద నుంచి రూ.1.53 లక్షల విలువ చేసే 30 ఎల్ఎస్‌డీ బ్లాస్టులు, 5.77 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ తిరుపతి యాదవ్ కథనం ప్రకారం...మాదాపూర్‌కు చెందిన దత్తిలితిన్, పడాల అభిరామ్ నాయుడు, కొడాలి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నారు. బెంగళూరు కేంద్రంగా గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకు డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ తిరుపతి తన బృందంతో కలిసి మాదాపూర్ అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న దత్తిలితిన్, అభిరామ్, కొడాలి ఏమార్టలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.83వేల విలువ చేసే 5.77గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### వ్యసనాలకు అలవాటుపడి..

వ్యవసనాలకు అలవాటుపడి డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులను హైదరాబాద్ డీటీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శిరీష కథనం ప్రకారం...చరణ్ తేజ్, కౌశిక్ తూబోటి, సయ్యద్ సర్ఫరాజ్ చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. వ్యసనాలకు అలవాటు పడిన వీరు.. డబ్బుల కోసం డ్రగ్స్ విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న అరుణ్‌రాజ్ ద్వారా సరుకు కొనుగోలు చేసి, నగరంలో అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న డీటీఎఫ్ బృందం గురువారం జూబ్లీహిల్స్ మాదాపూర్ రోడ్‌నం.37లో డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తుండగా ముగ్గురు విద్యార్థులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది.



అరెస్టయిన ఇంజినీరింగ్ విద్యార్థులు



## విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

### కలెక్టర్ అనుదీప్

జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్ సమర్థవంతంగా పనిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం(ఎఫ్ఆర్‌సీ)లో 67.65 శాతం హాజరు పెరిగి.. రాష్ట్రంలోనే హైదరాబాద్ ద్వితీయ స్థానం సాధించిందని పేర్కొన్నారు. హాజరుశాతం తక్కువగా ఉన్న పాఠశాలలకు సంబంధించిన సీఆర్‌పీఎస్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డీఈవో రోహిణి, అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 ( నమస్తే తెలంగాణ )

# మూసీ వెంబడి నిర్మాణాలపై సర్కారు దృష్టి

కూల్చివేతలపై అక్టోబర్ నెలాఖరులో తుది నిర్ణయం

సర్వే ముగియడంతో నోటీసులకు కసరత్తు

13వేలకుపైగా నిర్మాణాలు ఉన్నట్టు గుర్తింపు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : మూసీ వెంబడి నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేందుకు నిర్మాణాల కూల్చివేతలపై కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే మహానగరంలో విస్తరించి ఉన్న 55 కిలోమీటర్ల వెంబడి, ఇరువైపులా ఉన్న నిర్మాణాలపై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఇరిగేషన్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో సర్వే చేయగా, ఇప్పటివరకు 13వేలకు పైగా నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. లండన్‌లోని థేమ్స్ తరహాలో మూసీని లక్షన్నర కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా... ఈ నిర్మాణాల విషయంలో ఏం చేయబోతున్నారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే ప్రభుత్వం మాత్రం ముందు సంబంధిత నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలిసింది. నోటీసుల్లోనే సంబంధిత నిర్మాణం వివరాలను ఎందుకు కూల్చకూడదు అనే విషయంపై వివరణ ఇచ్చే విధంగా ఫార్మాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను అక్రమ, సక్రమమా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇప్పటికే ఓ దఫా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రాథమిక సర్వే చేశారు. ఈ సర్వే సమయంలోనే నిర్మాణం యొక్క పూర్తి వివరాలను ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో పొందుపరిచినట్లు తెలిసింది. అయితే ఇప్పుడు నోటీసుల ద్వారా సేకరించే వివరాల ప్రకారం కూల్చివేతలు ఎలా చేపట్టాలి..? పునరావాసం, పరిహారం ఏ విధంగా చెల్లించాలనే విషయాలపై ఈ నోటీసుల ద్వారా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా, ముందుగా సంబంధిత నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేసిన వెంటనే నేరుగా కూల్చివేతలు చేపట్టాలనే ఎంఆర్‌డీసీఎల్ అధికారులను ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆదేశించినట్లు తెలిసింది. కానీ నేరుగా కూల్చివేతలతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని భావించింది. ఈ క్రమంలోనే ముందుగా నోటీసులిచ్చి... అక్టోబర్ నెలాఖరులోగా కూల్చివేతలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

